# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-07-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లో ఇళ్లు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడిఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.**
2. **హైదరాబాదు నగర ప్రజల కోసం మెట్రో రైలు సౌకర్యాన్ని మరింత విస్తృత పరుస్తామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు.**
3. **ప్రపంచవ్యాప్తంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**
4. **ఉపరితల ఆవర్తనం కారణంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి.**
5. **హరారేలో జరిగిన 5వ .. చివరి టి20లో భారత్ 42 పరుగుల తేడాతో జింబాబ్వే పై విజయం సాధించింది.**

==========================

ఆంధ్రప్రదేశ్‌లో ఇళ్లు, పరిశ్రమలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇంధన సామర్థ్య నిర్వహణకు దోహదపడే ఉపకరణాల వినియోగంపై ప్రజల్లో చైతన్యం తెస్తామని ఆయన వివరించారు. మిషన్ లైఫ్ కార్యక్రమానికి సంబంధించి బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియన్సీ-బీఈఈ సలహాదారు చంద్రశేఖరరెడ్డి రూపొందించిన పోస్టరును ఆయన నిన్న విడుదల చేశారు.

--------------------------

హైదరాబాదు నగర ప్రజల కోసం మెట్రో రైలు సౌకర్యాన్ని విస్తృత పరుస్తామని తెలంగాణా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం లష్కర్ గూడలో గీత కార్మికుల కోసం ఆధునిక తరహాలో తయారు చేసిన 'కాటమయ్య రక్ష కిట్ల' ను లబ్ధిదారులకు నిన్న ఆయన అందజేస్తూ .... తాటి చెట్లు ఎక్కుతూ గీత కార్మికులు ప్రమాదాల బారిన పడకుండా ఈ కాటమయ్య రక్షా కిట్లు ఉపయోగ పడతాయని చెప్పారు. ఈ సందర్భంగా హైదరాబాదు నగరాభివృద్ధి కోసం చేపడుతున్న చర్యలను వివరించారు. వన మహోత్సవంలో భాగంగా తాటి వనాల పెంపును ప్రోత్సహిస్తామని తెలిపారు. హయత్ నగర్ వరకు మెట్రో రైలు సౌకర్యాన్ని అందుబాటులోకి తీసుకు వస్తామని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుకు అనుసంధానంగా రీజినల్ రింగ్ రోడ్డును నిర్మిస్తామని కూడా ముఖ్యమంత్రి తెలిపారు..

--------------------------

ఆంధ్రప్రదేశ్ ... మహా రాష్ట్ర రాష్ట్రాలు వివిధ రంగాలలో పరస్పరం సహకరించుకునేందుకు సిద్ధంగా ఉన్నాయని మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్ర బాబు నాయుడు ముంబై పర్యటనలో భాగంగా నిన్న కలుసుకున్న విషయాన్ని షిండే సామాజిక మాధ్యమం ఎక్స్ లో పంచుకున్నారు. ఇరు రాష్ట్రాలు పరస్పరం సహకరించుకోవడం ద్వారా ఏ విధంగా అభివృద్ధి సాధించాలన్న అంశంపై చంద్రబాబు నాయుడుతో తాను చర్చించానని షిండే ఈ సందర్భంగా తెలిపారు. రెండు రాష్ట్రాల ముఖ్య మంత్రుల సమావేశంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి ...., డిజిటల్ రంగాలలో సహకారం తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది..

--------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని నెల్లూరు నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. జిల్లాలోని కందలేరులో ఆయన గతరాత్రి పాత్రికేయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ... నెల్లూరు నగరంలో నీటిపారుదల కాలువలు ఏమేరకు ఆక్రమణకు గురయ్యాయి అనే విషయంపై సర్వే నిర్వహిస్తామన్నారు. భూగర్భ మురుగునీటి పథకంతో పాటు ప్రజలకు తాగునీటిని అందించే పథకాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి పేర్కొన్నారు.

--------------------------

సామాజిక మాధ్యమాల వేదికగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రజలకు మరింత చేరువవుతున్నారు. భారతీయ జనతా పార్టీ చేపట్టే ప్రజాహిత కార్యక్రమాలు మొదలుకుని విదేశీ పర్యటనల వరకు సంబంధిత సమాచారాన్ని ఎప్పటికప్పుడు నరేంద్రమోదీ సామాజిక మాధ్యమాలలో పంచుకోవడమే ప్రజలతో ఆయన చేరువ కావడానికి ప్రధాన కారణం. ఈ దిశగా ఎక్స్‌లో తనను అనుసరించే వారి సంఖ్య తాజాగా రికార్డు స్థాయిలో వంద మిలియన్లు .... అనగా పది కోట్లు దాటడడం విశేషం. ఇన్ని కోట్ల మంది ప్రజలు తనను అనుసరించడం పట్ల ప్రధాన మంత్రి హర్షం వ్యక్తం చేశారు. తన సామాజిక మాధ్యమం 'ఎక్స్" లో ప్రజల ఆశీర్వాదాలు, నిర్మాణాత్మక విమర్శలు, చర్చలు వుండడం తనకెంతో సంతోషదాయకమని నరేంద్రమోదీ పేర్కొన్నారు. భవిష్యత్‌లో ప్రజలతో ఇదే విధమైన సత్సంబంధాలను కొనసాగిస్తానని ప్రధానమంత్రి తెలిపారు.

--------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సోమశిల, కందలేరు జలాశయాలను మరింత పటిష్టం చేస్తామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన నిన్న మంత్రులు పి. నారాయణ, ఆనం రామనారాయణ రెడ్డితో కలిసి సోమశిల జలాశయాన్ని సందర్శించారు. వరదల వల్ల దెబ్బతిన్న అప్రాన్ ను మంత్రులు పరిశీలించారు. దెబ్బతిన్న వాటికి చేయబోయే మరమ్మతులను మంత్రులకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా నిమ్మల రామా నాయుడు మాట్లాడుతూ... 60 రోజుల్లో ఆప్రాన్ మరమ్మతు పనులను ప్రారంభిస్తామని, జిల్లాలోని జలాశయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు.

--------------------------

ప్రపంచ వ్యాప్తంగా యువతలో నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఈరోజు ప్రపంచ యువజన నైపుణ్య దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్య రాజ్య సమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూలై 15 వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది. ఐక్య రాజ్య సమితి, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు, పౌర సమాజ ప్రతినిధులు, యువతను ఒక వేదికపై చేర్చి యువతలోని ప్రతిభా పాటవాలను, నైపుణ్యాన్ని వెలికితీసి ప్రపంచ సమగ్రాభివృద్ధిలో

వారిని భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

యువత నైపుణ్యాలను వెలికి తీయడంలో ప్రపంచ వ్యాప్తంగా భారత దేశం ముందంజలో వుంది. ఈ దిశగా కేంద్రంలోని ఎన్.డి.ఎ. ప్రభుత్వం తగినంతగా నిధులు కేటాయించి యువతలో నైపుణ్యాలను వెలికి తీసే కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపడుతోంది. ఈ కార్యక్రమాలను అందిపుచ్చుకుంటున్న యువత మన దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల జీవన స్రవంతిలో పాలు పంచుకుంటున్నారు.

---------------------------

తెలంగాణాలో యువతకు ఉద్యోగావకాశాల కల్పనలో భాగంగా 6 వేల పోస్టుల భర్తీ కోసం రాష్ట్ర ప్రభుత్వం త్వరలో మరొక డి.ఎస్.సి. ని ప్రకటిస్తుందని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాదులో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.... యువతకు త్వరితగతిన ఉద్యోగాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 16 వేల ఉపాధ్యాయ పోస్టులు వున్నట్టు గుర్తించిందని, 11 వేల టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసిందని, ఈ దిశగా డి.ఎస్.సి. హాల్ టికెట్‌లను అందుబాటులోకి తీసుకు వచ్చిందని వివరించారు. నిరుద్యోగ యువతపైనే ప్రభుత్వం దృష్టి సారించిందని, కేవలం గత మూడు నెలలలో 30 వేల మందికి నియామక పత్రాలు అందజేశామని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో మత్తు పదార్థాలు వినియోగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. మద్యం మత్తులో ఉన్న యువకుడి చేతిలో గాయపడి, విశాఖలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పోలీసు కానిస్టేబుల్ ను హోం మంత్రి అనిత నిన్న పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పోలీసులకు ప్రభుత్వం ఎప్పుడు అండగా ఉంటుందని, విధుల్లో ఉన్న పోలీసులు ఆత్మస్థైర్యంతో పని చేయాలని హోం మంత్రి పేర్కొన్నారు.

---------------------------

కేంద్ర జలశక్తి అభియాన్ కార్యక్రమ నోడల్ అధికారి జితేంద్ర సింగ్ నిన్న పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలోని లింగరాయుడుగూడెం, కడియద్ద గ్రామాల్లో పర్యటించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జల్ జీవన్ మిషన్, జలశక్తి పథకాల అమలు తీరుని పరిశీలించారు. అమృత్ సరోవర్ పథకంలో అభివృద్ధి చేసిన చెరువులను, జల్ జీవన్ మిషన్ ద్వారా అందిస్తున్న ఇంటింటి కుళాయి కనెక్షన్లను పరిశీలించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. జల్ జీవన్ మిషన్, జలశక్తి పథకాలు ప్రజలకు ఏ మేరకు అందుతున్నాయో తెలుసుకునేందుకు ఇప్పటి వరకు చేపట్టిన పనులను పరిశీలిస్తున్నామని జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్. టి. ఆర్. జిల్లా విజయవాడ వద్ద ప్రకాశం బ్యారేజ్ జలకళ సంతరించుకున్నది. పట్టిసీమ నుండి విడుదల అవుతున్న గోదావరి జలాలు ...., ఎగువ ప్రాంతాలలో కురుస్తున్న వర్షాలతో ప్రకాశం బ్యారేజ్‌కు పెద్ద ఎత్తున నీరు వచ్చి చేరుతోంది. ప్రకాశం బ్యారేజ్ జలకళను సందర్శించడానికి ప్రజలు తరలి వస్తున్నారు.

---------------------------

ఈశాన్య రుతుపవనాలు క్రియాశీలకంగా ఉండడంతో పాటు, ఉపరితల ఆవర్తనం కారణంగా తెలుగు రాష్ట్రాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా ఈరోజు, రేపు భారీ వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణశాఖ పేర్కొంది. ఈరోజు దక్షిణ కోస్తా, రాయలసీమల్లో భారీ వర్షాలు కురుస్తాయని, గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, పిడుగులు పడే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

మరోవైపు.. హైదరాబాదులో గత కొన్ని రోజులుగా దాదాపు ప్రతి రోజూ వర్షం కురుస్తోంది. నిన్న హైదరాబాదులోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మియాపూర్, చందానగర్, లింగంపల్లి, హైదర్ నగర్, కూకట్ పల్లి, మూసాపేట్, బాచుపల్లి, కేపీహెచ్ బీ కాలనీ, ప్రగతి నగర్, నిజాంపేట్, మల్కాజిగిరి, నేరేడ్ మెట్, కుషాయిగూడ, చర్లపల్లి తదితర ప్రాంతాల్లో వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు చోట్ల రోడ్లపైకి నీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

--------------------------

హారారేలో నిన్న జరిగిన 5వ .. చివరి టి 20లో భారత్ 42 పరుగుల తేడాతో జింబాబ్వే పై విజయం సాధించింది. దీంతో భారత్ 4-1 తేడాతో సిరీస్ ను కైవసం చేసుకుంది. ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ ఆరు వికెట్లు కోల్పోయి 167 పరుగులు సాధించింది. 168 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో జింబాబ్వే 18.3 ఓవర్లలో 125 పరుకులకే అన్ని వికెట్లు కోల్పోయింది.

======================